

వరంగల్‌లో హరియాణా మందు

వరంగల్‌లో హరియాణా నుంచి తెచ్చిన మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు.

- 8లో▸



బీజేపీకి గుణపాఠం తప్పదు

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లుపెట్టి ఆమోదించకుంటే బీజేపీకి గుణపాఠం తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య హెచ్చరించారు.

- 9లో▸

గరిష్టం/కనిష్టం
$35.0^0 / 24.6^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గిరిజన సంస్కృతికి ప్రతీక 'తీజ్'



పెద్దవంగర: గిరిజన సంస్కృతీ, సంప్రదాయానికి పతీక తీజ్ పండగని ఎర్రబెల్లి ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని రాజ్‌మాన్ సింగ్, బావోజీ, బంగారు చెలిమి తండాలో నిర్వహించిన తీజ్ వేడకలో ఆమె పాల్గొని గిరిజన యువతులతో కలిసి ఆడిపాడారు. ఈ సందర్భంగా ఉషాదయాకర్‌రావు మాట్లాడారు. ఆరోగ్యాన్ని ఐకమత్యాన్ని కలిగించే తీజ్ పండగ నేపథ్యం చాలా గొప్పదన్నారు. ప్రతి పని ఆడపడుచుల చేత ప్రారంభిస్తే పాడి పంటలు బాగా ఉంటాయనే విశ్వాసంతో వేడుకలు చేపడుతారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బానోతు విజయ సోమన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, నాయకులు శ్రీరామ్ సుధీర్, బొమ్మెరబోయిన రాజు, రాంపాక మనోజ్, పుణ్యానాయక్, పటేల్ నాయక్, జమున గోపాల్, పద్మాదేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

9 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో గురువారం నిర్వహించిన దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) మొదటి సంవత్సరం బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ పరీక్షల్లో ఒక పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తూ.. 9 మంది విద్యార్థులు పట్టుబడగా డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. మొత్తం 1,225 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా.. 539 మంది గైర్హాజరైనట్లు వారు పేర్కొన్నారు.

పాకాలలో పర్యాటకుల సందడి



ఖానాపురం: పాకాలలో గురువారం పర్యాటకుల సందడి నెలకొంది. రాఖీ పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పాకాలలో మత్తడి ప్రదేశం, లీకేజీ ద్వారా వస్తున్న నీటిలో జలకాలాడుతూ ఉత్సాహంగా గడిపారు.

12 నుంచి లా కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని మూడేళ్ల లా కోర్సు రెండో సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్ అండ్ ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 12న పేపర్ 1, 15న పేపర్-2, 20న పేపర్-3, 22న పేపర్-4, 25న పేపర్-5 పరీక్షలు జరుగుతాయన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

నాల్గో సెమిస్టర్ పరీక్షలు..

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల లా కో ర్సు నాల్గో సెమిస్టర్ (రెగ్యులర్,ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) విద్యార్థులకు సెప్టెంబర్ 11వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. 11న పేపర్-1, 14న పేపర్-2, 19న పేపర్-3, 21న పేపర్-4, 23న పేపర్-5 పరీక్షలు నిర్వహించనున్నామని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఆయా పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

8 నుంచి ఎంబీఏ నాల్గో సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ నాల్గో సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్ అండ్ ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి. మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 8, 11, 13, 15, 19, 21, 23 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం!

మానుకోట మున్సిపాలిటీకి సీఎం రూ.50కోట్ల కేటాయింపు

- గత నెల టెండర్ ప్రక్రియ పూర్తి
- పలు పనులకు రీటెండర్
- బిల్లులు వస్తాయో.. రావో అని కాంట్రాక్టర్ల అనుమానం
- పనులు త్వరగా చేపట్టాలని ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ఆదేశం



సిగ్నల్ కాలనీలో చెత్తడంపింగ్ యార్డు చుట్టూ కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి ఇటీవల సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటించిన సందర్భంగా రూ.50కోట్లు కేటాయించారు. గత నెలలో టెండర్ ప్రక్రియ చేపట్టారు. అయితే పలు కారణాల వల్ల సగం పనులకు రీటెండర్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు ఒకే ఒక అభివృద్ధి పని ప్రారంభమైంది. కాగా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పనులను వేగవంతం చేయాలని ఒత్తిడి తెస్తున్నా.. టెక్నికల్ సమస్యలతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

మంత్రి సమావేశాలు..

మానుకోట మున్సిపాలిటీలో 36వార్డులు ఉండగా.. 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు ఉన్నారు. కాగా ఇటీవల సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీకి రూ.50కోట్లు.. మరిపెడ, డోర్నకల్, తొర్రూరు మున్సిపాలిటీలకు రూ.25కోట్ల చొప్పును నిధులు కేటాయించారు. ఈమేరకు మంత్రి సత్యవతిరాథోడ్, స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశాలు ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ శశాంక కూడా పలుమార్లు కలెక్టరేట్‌లో సమీక్షలు నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేసి పనులు ప్రారంభించి గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా గత నెలలో టెండర్ ప్రక్రియ చేపట్టారు. ఈ క్రమంలో పలు కారణాలతో రీటెండర్ చేయనున్నారు. అయితే 26వ వార్డు పరిధిలోని సిగ్నల్‌కాలనీ, గాంధీపురం సమీపంలోని చెత్త డంపింగ్ యార్డులకు సంబంధించిన ఫెన్సింగ్ పనులు మాత్రమే జరుగుతున్నాయి. టెక్నికల్ సమస్యలతో మిగతా పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు తెలుపుతున్నారు.

బిల్లులపై అనుమానం..

చాలా మంది కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు రాక మున్సిపాలిటీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో టెండర్ వేసేందుకు వెనుకాడుతున్నారు. పెద్ద పనులు కావడంతో అప్పులు తెచ్చి పనులు చేపట్టలేమని చెబుతున్నారు. సకాలంలో బిల్లులు రాకుంటే చేసిన అప్పుల వడ్డీలు కూడా రావనే ఆలోచనలో చాలామంది ఉన్నారు. ఈ నేపథ్యంలో వారిలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ఇటీవల మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. బిల్లుల్లో ఆలస్యం లేకుండా చూస్తామని చెప్పారు.

చేపట్టే పనుల్లో కొన్ని..

మున్సిపాలిటీ వార్డుల్లో నెలకొన్న సమస్యల ఆధారంగా నిధులు కేటాయించారు. విలీన గ్రామాలకు రూ.54 లక్షల చొప్పున, కొన్ని వార్డులకు రూ.50 లక్షలు, మరికొన్ని వార్డులకు రూ.30లక్షల చొప్పున నిధులు కేటాయించారు. కానీ నేటివరకు వార్డుల్లో ఒక్క పని కూడా ప్రారంభం కాలేదు.

- రూ.6కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం,తహసీల్దార్ కార్యాలయ స్థలంలో రూ.5కోట్లతో కళావేదిక నిర్మాణం చేపట్టనున్నారు.
- నూతన తహసీల్దార్ కార్యాలయం భవన నిర్మాణానికి రూ.కోటి, మేజర్ పార్కు నిర్మాణానికి రూ.కోటి కేటాయించారు.
- ఏబీసీ సెంటర్ భవనానికి రూ.కోటి, పెద్ద డ్రైయినేజీలు, రోడ్ల నిర్మాణాలకు రూ.10కోట్లు వెచ్చించారు.
- రెండు వైకుంఠధామాలకు రూ.50లక్షలు, ఫుట్‌పాత్‌లకు రూ.1.40 కోట్లు,సిగ్నల్ కాలనీ డంపింగ్ యార్డు,ఇతర పనులను రూ.40లక్షలు, వేబ్రిడ్జి నిర్మాణానికి రూ. 10లక్షలు కేటాయించారు.
- డీఆర్‌సీ సెంటర్‌లో వర్మికంపోస్ట్ షెడ్డుకు రూ.38 లక్షలు, ఆరు ఆటోల కొనుగోలుకు రూ.45లక్షలు వెచ్చించారు.
- డోజర్‌కు రూ.12.50లక్షలు, వీధి దీపాల నిర్వహణ కోసం రూ.32 లక్షలు, జంక్షన్ల అభివృద్ధికి రూ. 40లక్షలు, కంబాలచెరువు ట్యాంక్ బండ్ ఏర్పాటుకు రూ.2 కోట్లు, ఇతర పనులను ఇలా నిధులు కేటాయించారు.

ఎన్నికల ముందే పనులు పూర్తి చేసేలా..

రాబోయే అసెంబ్లీ ఎన్నికల ముందే మానుకోట మున్సిపాలిటీలో రూ.50 కోట్ల అభివృద్ధి పనులు పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కూడా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే అధికారులకు పనులు తలనొప్పిగా మారాయి. కాంట్రాక్టర్లు సహకరించకపోవడం, టెక్నికల్ సమస్యల వెంటాడుతున్నాయి. సమస్యలను అధిగమించి పనులు పూర్తి చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. రీటెండర్ ప్రక్రియ పూర్తి అయితే పనుల్లో వేగం పెరుగుతుంది.

టెక్నికల్ సమస్యలతో ఆలస్యం..

> టెక్నికల్ సమస్యలతో ప్రక్రియ ఆలస్యమవుతోంది. రీటెండర్ ప్రక్రియ చేపడుతాం. వాహనాలు కొనుగోలు చేశాం. సిగ్నల్ కాలనీలోని చెత్త డంపింగ్ యార్డులో ఫెన్సింగ్ పనులు చేపట్టాం. రీ టెండర్ ప్రక్రియ పూర్తిచేసి త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతాం.
> – సురేష్, మానుకోట మున్సిపాలిటీ ఏఈ

ఓటు హక్కును పరిశీలించుకోవాలి

- కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్నారని, ఓటర్లు తప్పనిసరిగా తమ ఓటు హక్కును పరిశీలించుకోవాలని కలెక్టర్ శశాంక కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రంలో యువ ఓటర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈనెల 2, 3తేదీల్లో ప్రత్యేక క్యాంపులు ఉంటాయన్నారు. స్వీప్ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై గ్రామాల్లో ప్రచారం చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు రుసుము చెల్లించాల్సిందే

జీఓ 59కింద 125గజాలకు పైగా స్థలం ఉన్నవారు క్రమబద్ధీకరించుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శశాంక హెచ్చరించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీఓ 59పై సంబంధిత అధికారులతో కలెక్టర్ శశాంక సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో గృహాలు నిర్మించుకున్నవారు క్రమబద్ధీకరణ కోసం జీఓ 59 కింద రుసుము చెల్లించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ధరలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. నిర్ణయించిన ధరలను మాత్రమే మూడు విడతల్లో చెల్లించాలన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్ణీత వ్యవధిలో దరఖాస్తుదారులు రుసుము చెల్లించేలా కౌన్సిలర్లు సహకరించాలన్నారు. సమావేశంలో మానుకోట మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీఓ అలివేలు, కమిషనర్ ప్రసన్నరాణి, తహసీల్దార్ ఇమ్మానీయల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా రహదారి విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. డివైడర్ పనులు చేపట్టాలన్నారు. సుమారు రూ.5కోట్లతో రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్



మాట్లాడుతున్న కడారి భోగేశ్వర్

విద్యారణ్యపురి: హైకోర్టు స్టేను తొలగించినందున ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలో టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు జరగకపోవడంతో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదోన్నతులు కల్పించాలని, పదోన్నతుల ద్వారా ఏర్పడిన వేకెన్సీలను డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు వి.అజయ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, ఉపాధ్యక్షుడు జె.స్వామి, బాధ్యులు ఈదుల వీరస్వామి, మనుపాటి వెంకట్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, పూర్ణచందర్, దోనం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

కాశిబుగ్గ: హైకోర్టు స్టే తొలగించడంతో ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భోగేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అలస్యం చేయకుండా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు వి.అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'రక్షాబంధన్' వేడుకలు



రాఖీ కట్టించుకున్న అనంతరం పిల్లలతో కలెక్టర్ శశాంక



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బాలసదనం చిన్నారులు



మరిపెడలో రాఖీలు కడుతున్న ముస్లిం మహిళలు



మరిపెడలో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా వ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలను ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆడబిడ్డలతో ఇళ్లు సందడిగా మారాయి. అక్కా చెల్లెళ్లు అన్నాదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్ తినిపించి నోరు తీపి చేశారు. రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మిఠాయి, పూలు, వస్త్ర దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగింది.

రద్దీగా రైల్వే స్టేషన్..

రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికులతో రైల్వే స్టేషన్, బస్టాండ్లు రద్దీగా మారాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో పాటు.. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారితో మానుకోట రైల్వేస్టేషన్ కిక్కిరిసిపోయింది. ఇటు విజయవాడ వైపు నుంచి, అటు సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చే రైళ్లన్నీ ప్రయాణికులతో నిండిపోయాయి. చాలామంది ప్రయాణికులు సీట్లు ఖాళీ లేక నిల్చొని ప్రయాణం చేశారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ

మహబూబాబాద్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. కాగా కలెక్టర్‌కు మహిళా అధికారులతో పాటు ప్రభుత్వ బాలసదనం బాలికలు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..మహిళలకు రక్షణగా నిలవాలనే ఉద్దేశంతో రాఖీ పండుగ జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ హైమావతి, ఇన్‌చార్జ్ డీపీఓ నర్మద, అధికారులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని చాటుతూ..

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో ముస్లిం మహిళలకు హిందూ సోదరులకు రాఖీలు కట్టి మతసామరస్యాన్ని చాటారు. ఈవేడుకల్లో మున్సిపల్ కౌన్సిలర్ సుజాతవెంకన్న, కో ఆప్షన్ సభ్యుడు మక్సూద్, ఖైరున్‌హుస్సేన్, స్రవంతిభద్రయ్య, లలితవెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ లతీఫ్, యాకూబ్‌పాషా, ఫైజ్‌ఖాన్, జాకీర్, పక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పసిపాపకు 'రక్ష'ణ

పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా ఆస్పత్రికి నియోనెటల్ కేర్ అంబులెన్స్ కేటాయింపు
- నవజాత శిశువులను ఎమర్జెన్సీ సమయంలో తరలించేలా చర్యలు
- పూర్తి ఉచితంగా అంబులెన్స్ సేవలు



నియోనెటల్ అంబులెన్స్‌లో శిశువును తరలిస్తున్న సిబ్బంది



నియోనెటల్ అంబులెన్స్‌లో అత్యాధునిక పరికరాలు

నెహ్రూసెంటర్: అప్పుడే పుట్టిన శిశువుకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూకు అనుసంధానంగా ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో నూతనంగా నియోనెటల్ అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. సేవలు పూర్తి ఉచితంగా అందనున్నాయి.

ఇతర ఆస్పత్రులకు తరలింపు..

ఆస్పత్రిలో జన్మించిన నవజాత శిశువుకు మెరుగైన వైద్యం అందించేందుకు ఇతర ఆస్పత్రులకు తీసుకెళ్లేలా అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నవజాత పిల్లల మరణాలను తగ్గించడంలో భాగంగా నియోనెటల్ అంబులెన్స్ ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. ఇప్పటికే జిల్లా ఆస్పత్రిలో ఎస్ఎన్‌సీయూ విభాగంలో అప్పుడే పుట్టిన పిల్లలకు ఏమైనా రుగ్మతలు ఉంటే మెరుగైన వైద్యం అందిస్తుండగా.. అత్యవసర వైద్యం అవసరం ఉన్న వారిని వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు తరలించేందుకు ఈ అంబులెన్స్ ఉపయోగపడుతుంది. ఇందులో అడ్వాన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వైద్య సేవలను అందించనున్నారు.

అంబులెన్స్‌లోని సౌకర్యాలు..

- ఆక్సిజన్ మాస్క్
- వెంటిలేటర్ సౌకర్యం.. శిశువుకు శ్వాస అందించడం కోసం
- రేడియంట్ వార్మర్
- ఇన్‌ఫ్యూజన్ పంప్.. సెలైన్ ఎక్కించేందుకు
- సిరంజి పంప్.. నిర్ణీత సమయంలో మందు ఇచ్చేందుకు
- మానిటర్, ఆక్సిజన్, పల్స్, హార్ట్‌బీట్ చూసేందుకు నియోనెటల్ అంబులెన్స్‌లో అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేశారు.

ఎంతో ఉపయోగం..



> క్రిటికల్ సమయాల్లో నవజాత శిశువులను ఇతర సెంటర్లకు పంపించేందుకు నియోనెటల్ కేర్ అంబులెన్స్ ఎంతో ఉపయోగకరం. అంబులెన్స్‌లో రేడియంట్ వార్మర్, ఆక్సిజన్, మానిటర్ అత్యాధునిక వైద్య పరికరాలను ప్రభుత్వం అందించింది. ఎమర్జెన్సీ సమయంలో హైదరాబాద్, వరంగల్ ప్రాంతాలకు శిశువును తరలించేందుకు నియోనెటల్ అంబులెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుంది.
> – శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

వైభవంగా పవిత్రోత్సవం



ఊర్ణసూత్రాల అలంకరణలో అమ్మవారు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం అమ్మవారికి పవిత్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఊర్ణసూత్రాల దండలను శాస్త్రోక్తంగా అమ్మవారి మూర్తికి, స్నపనమూర్తికి అలంకరించారు. పసుపు, ఎరుపు, నారింజ, నీలి, గులాబీ తదితర రంగుల ఊలు దారాల అలంకరణతో అమ్మవారు శోభాయమానంగా దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు, భక్తులు, అధికారుల కారణంగా జరిగే అపరాధాలు తొలగిపోయేందుకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు.

రేపటి నుంచి ప్రీ-లోక్ అదాలత్

- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి



మాట్లాడుతున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి

వరంగల్ లీగల్: శనివారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రీ-లోక్ అదాలత్ ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి తెలిపారు. గురువారం జిల్లా కోర్టులోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి మాట్లాడుతూ.. ఈనెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రీ-లోక్ అదాలత్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈఅదాలత్‌లో రాజీపడదగు క్రిమినల్, సివిల్, భూతగాదాలు, మోటర్ వెహికల్ యాక్సిడెంట్, వివాహ, కుటుంబ తగాదాలు, బ్యాంక్, చెక్‌బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, కన్స్యూమర్ ఫోరం, ట్రాఫిక్ ఈ–చాలన్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, ఇతర రాజీపగడదు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రీలోక్ అదాలత్‌కు హాజరయ్యే కక్షిదారులు, తమ కేసులను వారికి వీలైన రోజునే పరిష్కరించుకునేలా అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీమార్గంతో కేసులు పరిష్కరించుకొని ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాలని కోరారు. రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరుకావాలని తెలిపారు. ఎలాంటి సందేహాలు, సలహాలకు, న్యాయ సహాయం కోసం ఆయా న్యాయసేవాధికార సంస్థలను ఆశ్రయించి, ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందాలన్నారు. మరింత సమాచారం కోసం 93918 07362 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే.. ఈనెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు వరంగల్ జిల్లా కోర్టుతో పాటు నర్సంపేట కోర్టులో నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

రౌడీషీటర్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం..

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో బుధవారం రౌడీషీటర్ ఎస్‌డీ నజీర్ (37) దారుణ హత్యకు గురయ్యాడు.ఈ ఘటన సంచలనం సృష్టించింది. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సీఐ సురేష్ నేతృత్వంలో హత్య చేసి రైలులో పరారైన నిందితుల గురించి ఆరా తీస్తున్నారు. హత్యలో ఎంత మంది భాగస్వాములయ్యారు..? రైలు ఎక్కిఎటు వైపు పారిపోయారు..? ఎందుకు హతమార్చాల్సి వచ్చిందనే అంశంపై దర్యాప్తు చేపడుతున్నారు. హత్య ప్రదేశంలో లభ్యమైన సీసీ పుటేజీల ఆధారంగా కూడా నిందితుల వివరాలు ఇప్పటికే సేకరించినట్లు తెలుస్తోంది. హత్య చేసి పరారవుతున్న క్రమంలో రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి ఇప్పటికే చిక్కినట్లు సమాచారం. కేసును త్వరగా ఛేదించడానికి ఇప్పటికే మిల్స్‌కాలనీ పోలీసులు రైల్వే పోలీసు అధికారుల సహకారం తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచార ప్రకారం నిందితులు రైలు ఎక్కి ఉత్తర్‌ప్రదేశ్‌కు పరారవుతుండగా రైల్వే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులను వరంగల్‌కు తీసుకొచ్చేందుకు స్థానిక పోలీసులు వెళ్లినట్లు సమాచారం. నిందితులను శుక్రవారం సాయంత్రం వరకు వరంగల్ తీసుకొచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మునావర్ దేవ్ సింగ్ (ఫైల్)

కురవి: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మునావర్ దేవ్‌సింగ్(45)కు ఎకరంన్నర భూమి ఉంది. గతేడాది ఎకరం భూమిలో మిరప తోట సాగు చేశాడు. చేతికొచ్చే సమయంలో నల్లిరోగంతో పంట ఎండిపోయింది. దీంతో పంట కోసం చేసిన అప్పులు పెరిగాయి. అప్పులు తీరక మనస్తాపానికి గురైన ఆయన.. బుధవారం రాత్రి పురుగుల మందును తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటినా మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.గోపి తెలిపారు. మృతుడికి భార్య కళ, ఇద్దరు కుమారులున్నారు.

అనురాగం.. ఆప్యాయత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైభవంగా రాఖీ పౌర్ణమి


రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు రాఖీ కడుతున్న తన చెల్లెలు అనంత లక్ష్మి


దోర్నకల్ : ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు బొట్టు పెడుతున్న ఆయన సోదరి


టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క


వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి మునిగాల సరోజన

అక్కా తమ్ముడు, అన్నా చెల్లెల ప్రేమానురాగాలు ప్రతీక రాఖీ. ఈ పండుగ వెలకట్టలేని.. వదులు కోలేని మమతానురాగాలకు ప్రతిరూపం. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సోదరిమణులు తమ సోదరులకు రాఖీ కట్టి రక్తసంబంధాన్ని చాటిచెబుతారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆడపడుచులు తమ తోబుట్టువులకు రాఖీ కట్టి ఆప్యాయతను పంచుకున్నారు. అనంతరం అన్నదమ్ములు.. అక్కాచెల్లెళ్లకు తమకు తోచిన విధంగా కానుకలు అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, ఆడపడుచుల రాకతో ఆయా కుటుంబాల్లో సందడి నెలకొంది. అలాగే, గ్రామాలు, పట్టణాలు కళకళాడాయి.


బ్రహ్మకుమారీస్ రక్షా బంధన్ వేడుకల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ దంపతులు


కమలాపూర్ : బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు రాఖీ కడుతున్న సోదరి నీలమ్మ


హనుమకొండలోని నివాసంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్యకు రాఖీ కడుతున్న చెల్లెళ్లు


హైదరాబాద్‌లో రాఖీ కట్టిన జనగామ మహిళా ప్రతినిధులకు భోజనం వడ్డిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి


ఎమ్మెల్సీ 'కడియం'కు రాఖీ కడుతున్న బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు విజయ


నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి రాఖీ కడుతున్న కౌన్సిలర్ దార్ల రమాదేవి


భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రాఖీ కడుతున్న బీఆర్ఎస్ పార్టీ మహిళలు


ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ


మరిపెడ మండలం ఎల్లంపేటలో తన అన్న రవిచంద్రకు రాఖీ కడుతున్న చెల్లెలు, మహబూబాబాద్ ఎంపీ కవిత

వెల్లివిరిసిన మతసామరస్యం..

- ముస్లింకు 23 ఏళ్లుగా రాఖీ కడుతున్న హిందూ యువతి..


మహమూద్‌కు రాఖీ కడుతున్న శిరీష

కాజీపేట : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతిక రాఖీ. ఈ పండుగకు కుల, మతాలతో సంబంధం లేదు. దీనికి నిదర్శనమే ఈ ఘటన. కాజీపేట పట్టణానికి చెందిన ముస్లిం యువకుడు మహమూద్‌కు హిందూ యువతి శిరీష 23 సంవత్సరాలుగా రాఖీ కడుతోంది. చిన్నప్పటి నుంచే ఇరువురి కుటుంబాలకు మంచి సంబంధ బాంధ్యవ్యాలు ఉండేవి. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం పండుగ సందర్భంగా శిరీష.. మహమూద్‌కు రాఖీ కడుతోంది. పెళ్లయినా భర్త వినయ్‌తో వచ్చి రాఖీ కట్టి ఆప్యాయతను చాటుకుంటోంది. ఇందులో భాగంగా గురువారం కూడా మహమూద్ ఇంటికి వచ్చిన శిరీష.. మరోసారి రాఖీ కట్టి సోదర భావం చాటుకుంది.

రేపు మెగా జాబ్‌మేళా

రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన క్యూఆర్ కోడ్

హన్మకొండ అర్బన్ : నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళ కళాశాలలో ఈనెల 2న (రేపు) టీఎస్‌కేసీ, డీఈఈటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు క్యూఆర్ కోడ్ లేదా http://bit.y/3YNonUG లింక్ ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జాబ్ మేళాలో 20కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాఖీ కట్టించుకునేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం
- బైక్‌ను ఢీకొన్న వాగ్దేవి కళాశాల బస్సు
- తిమ్మాపురం క్రాస్ వద్ద ఘటన
- గోవిందరావు పేటలో విషాదం


ప్రమాద తీరును పరిశీలిస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్ : సోదరితో రాఖీ కట్టించుకుని త్వరగా వచ్చేస్తానంటూ ఓ వ్యక్తి బైక్ తీసుకుని కొద్ది దూరం బయల్దేరాడు. ఇంతలోనే మృత్యువు అతడిని బస్సు రూపంలో కబలించింది. ఈ ఘటన గురువారం సాయంత్రం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై తిమ్మాపురం క్రాస్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ములుగు జిల్లా గోవిందరావు పేటకు చెందిన కంచర్ల విజయ్‌కుమార్(36) లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. రోజుమాదిరిగానే లోడ్‌తో వరంగల్‌కు వచ్చాడు. వరంగల్ హంటర్ రోడ్డులో లారీని పార్కింగ్ చేశాడు. రాఖీ కట్టుకుని ఇప్పుడే వస్తానని క్లీనర్‌కు చెప్పి గంజు నర్సయ్య అనే వ్యక్తి బైక్ తీసుకుని బయలుదేరాడు. ఈ క్రమంలో ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం క్రాస్‌రోడ్డు వద్ద మామునూరు నుంచి వరంగల్ వైపునకు విద్యార్థులతో బయలుదేరిన వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల బస్సు అతివేగంతో బైక్‌ను ఢీకొంది. దీంతో విజయ్‌కుమార్‌కు తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై ప్రమోద్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీమున్నీరయ్యారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కుటుంబాన్ని భర్త పట్టించుకోవడం లేదని..

- వివాహిత ఆత్మహత్య
- నార్లవాయిలో ఘటన


నాగమణి(ఫైల్)

సంగెం: మద్యానికి బానిసైన భర్త.. ఇంటి బాగోగులు చూడడంలేదని, ఎంత చెప్పినా మారడం లేదని మనస్తాపం చెందిన ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నార్లవాయి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆత్మకూరు మండలం అక్కంపేటకు చెందిన చిలువేరు జానుకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు ఝాన్సీని సంగెం మండలంలోని నార్లవాయికి చెందిన యువకుడితో వివాహం జరిపించాడు. చిన్న కూతురు నాగమణి(23) అక్క ఇంటికి వచ్చిపోతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన మొలుగూరి ప్రదీప్‌తో పరిచయం ఏర్పడింది. 5 సంవత్సరాల క్రితం ఇద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి లోకేష్(4), స్నేహ(2) ఉన్నారు. ఈ క్రమంలో ప్రదీప్ ఏమి పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబం బాగోగులు పట్టించుకోవడం లేదు. దీనిపై భర్తకు ఎంత చెప్పినా పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెందిన నాగమణి.. ఆగస్టు 31వ తేదీన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి తండ్రి జాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం. భరత్ తెలిపారు.

బస్సులో బ్యాగు మరిచిన మహిళ..


బాధితురాలికి బ్యాగును అందజేస్తున్న పరకాల పోలీసులు

పరకాల: తన సోదరుడికి రాఖీ కట్టాలనే ఆరాటంలో ఓ మహిళ బస్సులోనే బ్యాగు మరిచిపోయింది. కొద్ది సేపటి తర్వాత ఈ విషయం గమనించి పరకాల పోలీసులను ఆశ్రయించింది. వారు స్పందించి వివరాలు సేకరించిన అనంతరం హనుమకొండ బస్‌స్టేషన్‌లో బ్యాగు స్వాధీనం చేసుకొని బాధితురాలికి అందజేశారు. పరకాల సీఐ వెంకటరత్నం కథనం ప్రకారం స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన కోయల్ కార్ బీనా బాయ్ తన ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న పెద్ద సోదరుడి వద్దకు వెళ్లి రాఖీ కట్టింది. తిరిగి శాయంపేటలో ఉంటున్న మరో సోదరుడికి రాఖీ కట్టేందుకు హనుమకొండ బస్టాండ్‌కు చేరకుంది. అక్కడ భూపాలపల్లి డిపో బస్సు ఎక్కింది. మార్గమధ్యలో మందారిపేట స్టేజీ వద్ద దిగి పిల్లలతో కలిసి సోదరుడి ఇంటికి వెళ్తుతుండగా బ్యాగు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన ఆమె.. పరకాల పోలీసులను ఆశ్రయించింది. బ్యాగులో దుస్తులతో పాటు మూడున్నర తులాల బంగారం ఉన్నట్లు తెలిపింది. దీంతో పరకాల సీఐ వెంకటరత్నం సీసీ పుటేజీని పరిశీలించడంతో పాటు బ్లూకోర్టు సిబ్బందిని అప్రమత్తం చేశారు. చివరకు భూపాలపల్లి డిపో అధికారుల ద్వారా సంబంధిత బస్సు కండక్టర్ వివరాలు తెలుసుకుని ఫోన్ చేయడంతో ఆయన బ్యాగు బస్సులోనే ఉన్నట్లు తెలిపారు. పోలీసులు వెంటనే హనుమకొండ బస్సు స్టేషన్‌కు చేరకొని బ్యాగును స్వాధీనం చేసుకుని బాధితురాలికి అందజేశారు. దీంతో ఊపిరి పీల్చుకున్న బాధితురాలు పరకాల పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

లైంగికదాడి నిందితుడికి 20 ఏళ్ల జైలు

నెల్లికుదురు: బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధించి బాధితురాలికి రూ.4 లక్షల సాయం అందిస్తూ పోక్సో కోర్టు స్పెషల్ సెషన్స్ జడ్జి పి.చంద్రశేఖర ప్రసాద్ తీర్పు ఇచ్చారని ఎస్సై కె.క్రాంతికిరణ్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం జాదు తండాకు చెందిన గుగులోతు లచ్చిరాం గత సంవత్సరంలో ఓ బాలికపై సామూహిక లైంగికదాడి కేసులో అప్పటి ఎస్సై పి.జితేందర్ పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పటి తొర్రూరు డీఎస్పీ రఘు సాక్ష్యాధారాలు సేకరించి చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీంతో జిల్లా న్యాయ స్థానం లచ్చిరాంకు 20 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.6వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. నిందితునికి శిక్షపడేలా చేసిన పీపీ ప్రభాకర్‌రెడ్డితో పాటు పోలీసు అధికారులను ఎస్పీ చంద్రమోహన్ అభినందించారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

కొడుకు గొంతు కోసి హత్య చేయడానికి ప్రయత్నించిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ గురువారం తెలిపారు. మండలంలోని ఆలేరుకు చెందిన జనగాం నరేష్ తన భార్య మౌనికపై అనుమానంతో కొడుకు నవదీప్ గొంతుపై కత్తితో కోయగా గాయమైంది. దీనిపై మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు నరేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్‌లో 'హరియాణ' మందు..

- అక్కడ తక్కువ ధరకు కొని.. ఇక్కడ ఎక్కువకు విక్రయం
- స్కూల్ బ్యాగుల్లో తీసుకొస్తున్న అక్రమార్కులు
- గుర్గావ్ నుంచి రైలు మార్గం ద్వారా వరంగల్‌కు చేరవేత
- ఆపై ఇంట్లోనే విక్రయం.. రైల్వే స్టేషన్‌లో పోలీసులకు చిక్కిన వ్యక్తి
- 51 బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ స్టాగ్, వ్యాట్ 69 ఫుల్ బాటిళ్లు స్వాధీనం


హరియాణ మద్యంతో పోలీసులు

సాక్షి, వరంగల్: వరంగల్‌లో హరియాణ లిక్కర్ దందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి రైలుమార్గం ద్వారా వరంగల్ తరలిస్తున్నారు. అనంతరం ఇంట్లోనే యథేచ్ఛగా మద్యం విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వరంగల్ పోలీసులు గురువారం వరంగల్ తుమ్మలకుంటకు చెందిన మనగాని గోవింద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఈ దందా వెలుగులోకి వచ్చింది. గోవింద్ ఎప్పటిలాగే హరియాణలోని గుర్గావ్‌కు వెళ్లి ఇండియన్ మేడ్ ఫారెన్ లిక్కర్ (ఐఎంఎఫ్ ఎల్) బాటిళ్లను స్కూల్ బ్యాగులో తీసుకుని రైలు మార్గం ద్వారా వరంగల్ చేరుకున్నాడు. ఇంటికి వెళ్తున్న క్రమంలో టాస్క్‌ఫోర్స్, ఇంతేజార్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. అనంతరం రూ.56,720 విలువైన 51 బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ స్టాగ్, వ్యాట్ 69 ఫుల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

రేటు రెట్టింపు...

హరియాణ ప్రభుత్వం ఇటీవల మద్యం ధరలను సడలించింది. ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్‌ను తగ్గించడంతో ఇతర రాష్ట్రాల కంటే అక్కడే తక్కువ ధరకు లభిస్తోంది. ఇదే అదునుగా భావించిన కొందరు అక్కడ మద్యం కొనుగోలు చేసి వరంగల్ తీసుకొచ్చి ఎక్కువ ధరకు అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు. ఈ కోవలోనే మనగాని గోవింద్ కూడా హరియాణలోని గుర్గావ్‌కు వెళ్లి అక్కడి నుంచి బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ స్టాగ్, వ్యాట్69 ఫుల్ బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకొస్తున్నాడు. అక్కడ బ్లెండర్స్ ప్రైడ్ ఫుల్ బాటిల్ రూ.680 ఉండగా ఇక్కడ రూ.1320కు, రాయల్ స్టాగ్ ఫుల్ బాటిల్ రూ.400 ఉండగా ఇక్కడ రూ.860, వ్యాట్ 69 ఫుల్ బాటిల్ రూ.2,000 ఉండగా ఇక్కడ రూ.3,800 కు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఇతనే కాకుండా చాలా మంది హరియాణ, రైల్వే పోలీసుల కనుగప్పి ఈ లిక్కర్ అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో నగర పోలీసులు నిఘా పెంచారు. ఈ నేపథ్యంలోనే ఇంతేజార్‌గంజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన గోవింద్‌ను తనిఖీ చేశారు. ఇందులో తన బ్యాగులో లిక్కర్ లభించగా ఈ దందా వెలుగులోకి వచ్చింది. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్ఐ నర్సింహతోపాటు ఇంతేజార్‌గంజ్ పోలీసులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాల్లో 'పొగగొట్టం' చిచ్చు..

ఖిలా వరంగల్: వరంగల్ 38వ డివిజన్ మధ్యకోటలో ఇంటిపై ఉన్న పొగగొట్టం రెండు కుటుంబాల్లో చిచ్చుపెట్టింది. నా ఇంటిపై పొగ వస్తుందంటే పట్టించుకోవా.. అంటూ ఓ వ్యక్తి పక్కటింటి వారితో గొడవ పడ్డారు. గొడవ పెద్దగా మారింది. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఇంటిపైనున్న పొగగొట్టాన్ని ఎట్టకేలకు తొలిగించారు. దీంతో ఆగ్రహంతో ఇరువురు ఘర్షణ పడగా మహిళ చెందిన ఇంటి డోర్లను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

దూడల సంరక్షణతోనే.. 'పాడి' వృద్ధి

- రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి
- పాడిపరిశ్రమతో అధిక లాభాలు
- మడికొండ పశువైద్యాధికారి కరుణాకర్ రెడ్డి


ఆవు దూడలు

కాజీపేట: పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే దూడల సంరక్షణే కీలకమని, వీటి పెంపకంపై పాడి రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని మడికొండ పశు వైద్యాధికారి కరుణాకర్ రెడ్డి తెలిపారు. దూడల పెంపకంపై శ్రద్ధ వహిస్తే అధిక లాభాలు పొందొచ్చన్నారు. దూడల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి 'సాక్షి' తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పెంపకమే కీలకం..

దూడలు పుట్టినప్పటి నుంచి ఎదకు వచ్చే వరకు వాటిని కంటికి రెప్పాలా కాపాడుకోవాలి. దూడలు బలంగా, ఆరోగ్యంగా ఉండేలా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. పుట్టిన దూడకు వెంటనే జున్ను పాలు తాగించాలి. దీంతో దూడలో వ్యాధి నిరోధక శక్తి పెరిగేతే, భవిష్యత్‌లో వాటికి వ్యాధులు సోకకుండా, ఆరోగ్యంగా ఉంటాయి. అయితే అవగాహనా రాహిత్యంతో కొంతమంది రైతులు పాడి పశువుల నుంచి మొత్తం పాలు పితుకుతారు. దీంతో దూడ పాలు సరిపోక నీరసించి, వ్యాధి నిరోధక శక్తి కోల్పోతుంది. అనంతరం వ్యాధుల బారిన పడి మృత్యువాత పడే ప్రమాదం ఉంది. అందుకే రైతులు దూడలకు సరిపడా పాలు అందేలా జాగ్రత్త వహించాలి.

దూడలకు వ్యాప్తి చెందే వ్యాధులు..

దూడల సంరక్షణలో వాటికి పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వైరస్, బ్యాక్టీరియా, ఇతరత్రా వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా దూడలకు అతిసార, తెల్లపారుడు, న్యుమోనియా, రక్తవిరోచనాలు, కీళ్ల నొప్పులు, బొడ్డువాపు వ్యాధులతో పాటు ఇతరత్రా వ్యాధులు, పరాన్న జీవులతో వ్యాప్తి చెందుతాయి. దూడలు ఎలాంటి రోగాల బారిన పడకుండా చక్కగా పెరిగితే రైతుకు ఆదాయమే. వీటి పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.

మడికొండ పరిధిలో..

మడికొండ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం తదితర పనుల నిర్వహణకు తగినంత సాగునీరు లేకపోవడంతో రైతులు పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో పాడిపై సరైన అవగాహన లేకపోవడంతో రైతులు కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. దీంతోపాటు వర్షాభావ పరిస్థితులు, పంటలకు గిట్టుబాటు ధర లభించక అప్పులయ్యేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి నుంచి తేరుకున్న ఈ ప్రాంత రైతులు పాడిపై దృష్టి సారిస్తూ లాభాలు పొందుతున్నారు. ప్రారంభంలో ఒకటి, రెండు ఆవులను కొనుగోలు చేసి పాడిని ప్రాంభిస్తున్నారు. వ్యవసాయ పనులతో పాటు ఉదయం, సాయంత్రం కొద్ది సమయం పాడి పశువుల కోసం సమయం కేటాయిస్తూ అధిక లాభాలు అర్జిస్తున్నారు. ఇప్పటికే ఆవులను కొనుగోలు చేసి, పాడితో లాభాలు పొందుతున్న రైతులను గమనిస్తున్న ఇతర రైతులూ పాడి ఆవులను కొనుగోలు చేసి పాడి పరిశ్రమపై ఆధారపడేందుకు మొగ్గుచూపుతున్నారు. దూడలను కాపాడుకుంటూ అదనపు ఆదాయం పొందుతున్నారు.

వైద్య పరీక్షలు తప్పనిసరి ..

పాడి రైతులు పుట్టిన దూడల పెంపకంపై జాగ్రత్త వహించకుండా పాలిచ్చే ఆవులపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. లేగదూడలు పుట్టిన వెంటనే వాటికి ముర్రుపాలు తాగించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. బోడ్డు కోసే సమయంలోనూ జాగ్రత్త అవసరం. లేగదూడల వయసును బట్టి అవి బలిష్టంగా పెరిగేందుకు సరిపడ పాలు మిగల్చడం ఎంతో ముఖ్యం. దూడలు ఆరోగ్యంగా పెరిగితేనే భవిష్యత్తులో అధిక మొత్తంలో పాలు ఇస్తాయి. దీంతో పాటు పాడి ఆవుకు ఆరోగ్యరమైన సమస్యలు తలెత్తవు. పెంపకంలో ఎలాంటి అనుమానం తలెత్తిన వెంటనే సమీపంలో ఉన్న పశువైద్యాధికారిని సంప్రదించాలి. అనుమానాన్ని నివృత్తి చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలి. లేకపోతే భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. పాడిపశువుల విషయంలో పరిశుభ్రత చాలా ముఖ్యమైందని పెంపకం దారులు గుర్తించాలి.